క్లుప్తంగా

శిథిల భవనాలు తొలగింపు..



కారెంపూడి: స్థానిక గురుకుల పాఠశాల ఆవరణలో శిథిలమైన మట్టి మిద్దెలను శనివారం తొలగించారు. 1983లో ఎస్ఎస్‌పీకి చెందిన ఈ మట్టి మిద్దెలలో తాత్కాలికంగా పాఠశాల ప్రారంభమైంది. 1988న నూతన భవనంలోకి తరగతులు మార్చారు. అప్పటి నుంచి నిరుపయోగంగా ఉన్న మూడు బ్లాకులు పైకప్పులు పడిపోయి పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అసౌకర్యంగా మారాయి. వీటి తొలగింపుతో స్థలం కలసి వచ్చింది.

ఘనంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



మాచర్ల స్థానిక బస్టాండ్ వెనుక ఉన్న వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం స్వామివారికి శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వీరాంజనేయరెడ్డి, చుండూరు మల్లికార్జునరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. పలువురు దంపతుల సమక్షంలో స్వామి వారికి అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు ఈఓ శ్రీగిరిరాజు నర్సింహబాబు ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వలంటీర్లు.. ఒక్కటయ్యారు



మాచర్ల: వారిద్దరు వలంటీర్లు. సామాజిక వర్గాలు వేరు. ప్రేమ కారణంగా దగ్గరైన వీరు.. పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. పెద్దలను ఒప్పించి శనివారం పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో మేఘన, బత్తిన మణికంఠ ఆదర్శ వివాహం చేసుకున్నారు. 17, 18 వార్డులలో పనిచేస్తున్న వీరిద్దరిది ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మాచర్ల సుందరరావు, బత్తిన వేణు, వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు మట్టా శ్రీను, గ్రామ పెద్దలు మాచర్ల వాసు, నాగేశ్వరరావు, యోహాను, ప్రకాష్, పలువురు హాజరై వధువరులకు ఆశీర్వాదాలు అందించారు.

విద్యార్థికి బంగారు పతకం



విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి పి.ఈశ్వర్‌రావు ఏపీ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. ఈశ్వర్‌రావుకు మంగళగిరిలోని ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో సర్టిఫికెట్, గోల్డ్‌మెడల్ ప్రదానం చేశారు. శనివారం కళాశాల ప్రిన్సిపల్ జి.రంగాచార్యులు అతనిని అభినందించారు. మ్యాథ్స్ అధ్యాపకులు ఎస్.శరత్‌బాబు, కె.లింగేశ్వరావు, నాగార్జునను ఆయన అభినందించారు. డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ మల్లికార్జునరావు, స్పెషల్ ఆఫీసర్ కుమార్, అధ్యాపకులు రాజశేఖర్, చంద్రశేఖర్, శ్రీనునాయక్, గోపయ్య, ఎల్లారెడ్డి, సుబ్బారెడ్డి, సిబ్బంది వెంకటేష్, జాని పాల్గొన్నారు.

జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్‌గా ఎండీ రషీద్



పిడుగురాళ్ల: పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్‌గా ఎండీ రషీద్ శనివారం ఎన్నికయ్యారు. రషీద్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన గురజాల, మాచర్ల ఎమ్మెల్యేలు కాసు మహేష్‌రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తానని ఆయన తెలిపారు. పలువురు రషీద్‌ను పిడుగురాళ్ల పట్టణంలోని కార్యాలయంలో సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

మారనున్న రైల్వే స్టేషన్ల రూపురేఖలు

- అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద నిధులు..
- మౌలిక వసతులు, స్టేషన్ల అభివృద్ధి..
- పిడుగురాళ్ల, నడికుడికి ఆధునిక హంగులు



పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ ముఖ ద్వారం


గురజాల: ప్రయాణికుల సౌకర్యార్థం వసతుల కల్పన, రైల్వే స్టేషన్ల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అమృత్ భారత్ స్టేషన్ పథకానికి పిడుగురాళ్ల, నడికూడి రైల్వే స్టేషన్లు ఎంపికయ్యాయి. రైల్వే స్టేషన్‌ల ఆధునీకీకరణకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో ఈ పథకానికి నిధులు కేటాయించింది. వెనుకబడిన పల్నాడు ప్రాంతంలోని పిడుగురాళ్ల రైల్వే స్టేషన్, నడికూడి జంక్షన్‌లను ఆధునీకరించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. స్టేషన్‌లలో అన్ని సదుపాయాలు సమకూర్చి, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టనున్నట్లు రైల్వే అధికారులు చెప్పన్నారు.

కల్పించే సౌకర్యాలు ఇవి..

రైల్వే స్టేషన్‌లో నూతన భవనాలు, ఫ్లోరింగ్, ఆధునిక శైలిలో నిర్మాణం, ట్రాక్‌ల శుభ్రత, ప్రయాణికుల తాకిడి ఆధారంగా ఎస్కలేటర్ల ఏర్పాటు, దివ్యాంగులకు ప్రత్యేకంగా వీల్‌చైర్లు, ప్రత్యేక ప్రవేశ మార్గాలు రానున్నాయి. ప్రయాణికుల వెయిటింగ్ హాల్, పార్కింగ్, పాదచారులకు ప్రత్యేక దారి వంటి సుమారు 50కి పైగా మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.

> **రద్దీ ఆధారంగా సదుపాయాలు**
>
> ప్రయాణికుల రద్దీ ఆధారంగా సదుపాయాల కల్పనకు ప్రణాళిక రూపొందించడం జరుగుతుంది. పలు ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుంటారు. ఈ పథకం ద్వారా పిడుగురాళ్ల, నడికూడి రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోతాయి. గత వారం ఉన్నతాధికారులు రైల్వేస్టేషన్‌లను పరిశీలించారు.
>
> – నాగార్జునరావు, రైల్వే సీఐ, పిడుగురాళ్ల

అకాల వర్షంతో అవస్థలు



పట్టలపై చేరిన వర్షపు నీరు

మాచవరం: అకాల వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రైతులు ఇబ్బందులకు గురయ్యారు. మిర్చి, మొక్కజొన్న, కంది, మినుము పంటలను కాపాడుకునేందుకు అవస్థలు పడ్డారు. కల్లాల్లో ఉన్న మిర్చి వర్షానికి తడవకుండా ఉండేందుకు టర్పాలిన్ పట్టలు కప్పారు. పల్లపు ప్రాంతాల్లో ఉన్న మిర్చి కల్లాల్లోకి వర్షపు నీరు చేరడంతో తడిచిపోయింది. కోత కోసి నేలపై ఉన్న కంది, మినుము, మొక్క జొన్న తడిచి ముద్దయ్యాయి.

పిడుగురాళ్లలో..

పిడుగురాళ్లరూరల్: రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు నూగు పంట నెలకొరిగింది. కంది పంట కొన్ని చోట్ల నెలకొరగగా, ఈదురు గాలులకు పూత రాలిపోయింది. కల్లాల్లో ఆరబోసిన మిర్చిపంట తడిసిపోయింది.



కల్లాల్లో మిర్చి పంటపై కప్పిన పట్టలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..



మాట్లాడుతున్న తహసీల్దార్ పుల్లారావు

రెంటచింతల: ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాలకు పాతకాలం నాటి మట్టి గోడలు నాని, పడిపోయే ప్రమాదం ఉందన్నారు. మరో రెండుమూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని.. వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ మోటర్లు ఆన్ చేసే సమయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఈ నెల 16న రెంటాల గ్రామ శివారు పంట పొలంలో పిడుగు పడి 26 జీవాలు(గొర్రెలు) మృతి చెందాయని గుర్తుచేశారు. మండలంలోని గ్రామాల పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీఆర్వోలకు పలు సూచనలు చేయడం జరిగిందన్నారు.

'మిర్చి' రైతులు.. జాగ్రత్తలు పాటించాలి

పిడుగురాళ్ల: అకాల వర్షాలకు మిరప పంట నష్టపోయిన రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని హార్టికల్చర్ ఆఫీసర్ బీజే బెన్నీ సూచించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం మిరప పంట కోత రెండు, మూడవ పూర్తి అయిందని, కల్లాలలో ఎండుతున్న దశలో ఉందన్నారు. కల్లాల్లో ఉన్న కాయలు తడవకుండా టర్పాలిన్ పట్టలతో కప్పాలన్నారు. వర్షాలు ఆగిన తర్వాత.. కోత కోసి ఎండబెట్టేటప్పుడు కాయకుళ్లు ఆశించిన కాయలను వేరుచేసి విడివిడిగా ఎండబెట్టుకోవాలని ఆయన సూచించారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

మాచర్ల: పట్టణంలోని ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ పాఠశాల, కృష్ణవేణి, పల్నాడు జూనియర్ కళాశాలల్లో ఇంటర్‌మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయి. శనివారం 1,150మంది విద్యార్థులు హాజరయ్యారు. అర్బన్ సీఐ టి.బాలకృష్ణ బందోబస్తు పర్యవేక్షించారు. ఆయా పరీక్ష కేంద్రాలను పలువురు అధికారులు పరిశీలించారు.

'మిర్చి' రక్షణ చర్యలు తీసుకోవాలి

కారెంపూడి: అకాల వర్షాల నుంచి మిర్చి పంటను కాపాడుకునేందుకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని గురజాల రీజినల్ ఉద్యాన శాఖాధికారి వై.మోహన్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. మిర్చి రెండు, మూడవ కోతల కాయలు కల్లాల్లో ఎండబెట్టి ఉన్నాయని, వాటికి టర్పాలిన్ పట్టాలు కప్పాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పంట మీద ఉన్న కాయలకు అధిక తేమ వల్ల కుళ్లు వచ్చే అవకాశం ఉందని.. దీని నివారణకు మాంకోజెబ్ లీటరు నీటికి 2.5 గ్రాములు, అలాగే సూక్ష్మ పోషకాల మిశ్రమం ఎగ్రోమిన్‌మాక్స్ లీటరు నీటికి 2.5 గ్రాములు కలిపి పిచికారి చేయాలని సూచించారు. వర్షాలు తగ్గిన తర్వాత కాయకుళ్లు ఆశించిన వాటిని తొలగించి, ఎండబెట్టాలని సూచించారు.

నేడు కవి సమ్మేళనం

మాచర్ల: ఉగాది పండుగను పురస్కరించుకొని ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు శనివారం తెలిపారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సాయంత్రం 3 గంటలకు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. సభ నిర్వహణ పల్నాటి సాహిత్య పీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు చూస్తారని చెప్పారు. పల్నాడు జిల్లాలోని కవులు పాల్గొని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు పందిరి నరసింహరావు, బచ్చు రాజ్‌కుమార్, వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, కోశాధికారి ముప్పవరపు నాగార్జున, జోన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు తదితరులున్నారు.

వెంకటేశ్వరస్వామి సన్నిధిలో మున్సిపల్ చైర్మన్

పిడుగురాళ్ల: పట్టణ శివారులోని దేవరంపాడు శ్రీ వెంకటేశ్వర స్వామిని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు దంపతులు శనివారం దర్శించుకున్నారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ పూజారులు చైర్మన్ దంపతులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

భోజన శాల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న పూర్వ విద్యార్థులు

మాచవరం: చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. మాచవరం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో భోజనశాల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. 1997–98 బ్యాచ్ విద్యార్థులు సుమారు రూ.12 లక్షల వ్యయంతో భోజన శాలను నిర్మించేందుకు శంకుస్థాపన చేసినట్లు హెచ్ఎం తాతిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లఘువరపు రామారావు, ఎరగాని వెంకటరావు, గుదె నాగేశ్వరావు, కాకరపర్తి రామకృష్ణ, సతీష్, లక్ష్మీ నారాయణ, చలమయ్య, వెంకట్ పాల్గొన్నారు.

చట్ట సవరణలపై అవగాహన ఉండాలి

పదవ అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న పదవ అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వర్లు

గురజాల: మోటారు వెహికల్ చట్టంలో చేసిన సవరణలపై అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, పదవ అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక కోర్టు భవనాల నందు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోటారు వాహన చట్టాలను సవరణ చేయడం జరిగిందని, వాటిని తెలుసుకోవాలన్నారు. వాహన ప్రమాదాల కేసులో బాధితులకు, కుటుంబ సభ్యులకు త్వరితగతిన పరిహారం అందించే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి బీఎల్‌వీ శేషాద్రి, జూనియర్ సివిల్ జడ్జి మంజులత, న్యాయవాదులు కొంగర హరి సత్యనారాయణ, మందపాటి శ్రీనివాసరెడ్డి, జానీబాష, జక్కా చెన్నకేశవరావు, చీతిరాల కోటేశ్వరరావు , మాచర్ల వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఆర్టీసీ మేనేజర్, ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయ వాదులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మురళీ గంగాధర్‌రావు

పిడుగురాళ్ల: ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి, లోక్ అదాలత్ చైర్మన్ ఎం. మురళీగంగాధర్‌రావు అన్నారు. పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ విజ్ఞాన సదస్సులతో చట్టాలపై పూర్తిగా అవగాహన వస్తుందన్నారు. కొత్త న్యాయవాదులు కూడా కొన్ని చట్టాలపై అవగాహన పొందటం జరుగుతుందన్నారు. అనంతరం లోక్ అదాలత్ కార్యాక్రమం నిర్వహించారు. మనోవర్తి కేసు 1, 498–ఏ ఏపీసీ కేసులు 5 పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రేమ్‌కుమార్, దారా చెన్నయ్య, కె.రామరెడ్డి, మాణిక్యం, పీబీఎస్ రాజు, ఈసా ప్రేమ్, ప్రశాంత్ నాయక్, బత్తుల దాసు, లోక్ అదాలత్ మెంబర్లు పి.నవ్య, వనమా వెంకట సుబ్బారావు, ఐ.పిచ్చియ్య, న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

పెళ్లి కానుక అందజేత



పెళ్లి కానుక అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: చింతలపూడి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలోని పాటిగుంతలలో నివాసం ఉంటున్న మాబుఖాన్, రంజాన్‌బి కుమార్తె నషిరున్‌కు చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చొంతలపూడి శ్రీనివాసరావు బంగారు ఉంగరం, సారె అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని పల్నాడు ఓయాసిస్‌లో ముప్పిపూడి నాగరాజు, అనంత రాములమ్మ కుమార్తె, వధువు శివపార్వతికి తాళిబొట్టు, పట్టు చీర, సారెను ఇచ్చి ఆశీర్వదించారు. పాటిగుంతలలో ఇచ్చిన కల్యాణ కానుకకు ఎండీ జబ్బార్ పాల్గొని వధువును ఆశీర్వదించారు.

వ్యక్తి ఆత్మహత్య

చిలకలూరిపేట టౌన్: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని గుండయ్యతోటకు చెందిన అన్నలదాసు సుబ్బారావు(37) ఈ నెల 10వ తేదీ ఆర్థిక ఇబ్బందులతో వంటిపై కిరోసిన్ పోసుకొని ఇంటి బయట నిప్పంటించుకున్నాడు. గమనించిన భార్య స్థానికులు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్బారావు శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురిపై దాడి కేసు నమోదు

యడ్లపాడు: బోయపాలెం గ్రామానికి చెందిన ఎం.రవీంద్ర నాయక్‌పై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని బ్రిక్ కంపెనీ యజమాని వి.శ్రీనుబాబు, కంపెనీలో గుమస్తా అయిన ఎం.రవీంద్రనాయక్‌ను ఇటీవల రూ.83,500 డబ్బులు వసూలుకు పంపించారు. అక్కడ నగదు వసూలు చేసి, వాటితో కనిపించకపోవడంతో నిర్వాహకులు, పోలీసులకు మౌఖికంగా తెలియజేసి వెతుకులాట ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి బోయపాలెంలో ఉన్నట్లు గుర్తించి నగదు ఇవ్వాలంటూ నిలదీశారు. సరైన సమాధానం ఇవ్వకపోవడంతో అతడిపై శ్రీనుబాబుతో మరో ఇద్దరు దాడి చేశారు. పోలీసులకు అప్పగించారు. గాయాలైన రవీంద్రను చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక వైద్యసేవలు అందించి మెరుగైన చికిత్సకు గుంటూరు సమగ్ర ఆసుపత్రికి తరలించారు. బాధితుడి నుంచి ఫిర్యాదు అందుకున్న ఎస్ఐ పైడి రాంబాబు ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

నులి పురుగుల నివారణకు చర్యలు



మాత్రలు వేస్తున్న వైద్యాధికారిణి ప్రభావతి

పిడుగురాళ్ల: చిన్నారులకు నులి పురుగుల మాత్రలు వేయాలని వైద్య సిబ్బందికి వైద్యాధికారిణి ప్రభావతి సూచించారు. పట్టణంలోని 17 సచివాలయ పరిధిలో చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పిడుగురాళ్ల పట్టణంలో 6,256 మంది చిన్నారులు ఉండగా ఇటీవల 5,866 మందికి అల్బెండజోల్ మాత్రలు వేసినట్లు తెలిపారు. మొత్తం 98.4 శాతం మంది చిన్నారులకు మాత్రలు వేయడం జరిగిందన్నారు. మిగిలిన వారికి రెండు, మూడు రోజుల్లోనే అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కారెంపూడిలో ఓడీఎఫ్ పరిశీలన బృందం

కారెంపూడి: పరిసరాల పరిశుభ్రత ద్వారానే గ్రామాల్లో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, అందరూ మరుగుదొడ్లు వినియోగించాలని స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో పని చేస్తున్న రీడ్స్ ఆర్గనైజేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ వి.బాబూరావు కోరారు. బహిరంగ మల, మూత్ర విసర్జిత రహిత గ్రామం (ఓడీఎఫ్ ప్లస్)గా ఎంపికైన కారెంపూడి గ్రామాన్ని రీడ్స్ అధికారులు శనివారం సందర్శించారు. ఇక్కడ విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, నివాసాల్లో మరుగుదొడ్లు ఉన్నాయని చెప్పారు. డంపింగ్ యార్డును పరిశీలించామని, అలాగే ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్ నిర్వహణ బాగుందన్నారు. అందుకే ఈ గ్రామం ఓడీఎఫ్ ప్లస్‌గా ఎంపికైందని, దీనిని నిలుపుకునేందుకు గ్రామస్తులందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ఓడీఎఫ్ పరిశీల బృందం సభ్యుడు డి.కోటేశ్వరరావు పాల్గొన్నారు. సర్పంచ్ రమావతు ప్రమీలాబాయి, ఈఓపీఆర్డీ పి.సత్యప్రసాద్ గ్రామంలో అమలవుతున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను వారికి వివరించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

మంచికల్లు(రెంటచింతల): మంచికల్లులోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయం 31వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. గోవిందమ్మ సమేత వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపించారు. ఆలయ అర్చకులు సాంబయ్య ఆచారి, వెంకటాచారి పూజలు చేశారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని స్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఆలయ ధర్మకర్తలు మొండెద్దు వెంకటరెడ్డి, పామిరెడ్డి కేశవరెడ్డి, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

• పనికైనా.. బడికైనా.. మేమింతే..!





రెంటచింతల: రోజువారి కూలీలైనా..బడికెళ్లే విద్యార్థులైనా.. ఇలా ప్రమాదభరితంగా ఆటో పట్టుకుని వేలాడుతూ వెళ్లాల్సిందే. ఇక్కడ కనిపిస్తున్న రెండు ఆటోల్లో పొలం పనులకెళ్లే కూలీల ఆటో ఒకటైతే.. రెంటచింతల నుంచి జెట్టిపాళెం ఏపీ మోడల్ స్కూలుకు విద్యార్థినులను తీసుకెళ్తున్న ఆటో మరొకటి. విద్యార్థినులు దాదాపు 8కిలోమీటర్లు ఇలా వేలాడుతూ..బడికి చేరుకుంటున్నారు. ఈ మార్గంలో బస్సు సౌకర్యం ఉన్నా.. ఆటోలనే ఆశ్రయిస్తున్నా రు. మంచికల్లు, రెంటాల, మిట్టగుడిపాడు, పశర్లపాడు, జెట్టిపాలెం, గోలి, మల్లవరం తదితర గ్రామాల్లో ఎక్కువ మంది ఆటోల్లోనే ప్రయాణిస్తున్నారు. ఒక్కో ఆటోలో 15 నుంచి 20 మందిని డ్రైవర్లు ఎక్కిస్తున్నారు. ఇలాంటి ప్రయాణం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి.. చాలామంది ప్రాణాలు విడుస్తున్నా కొందరిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. సమయానికి చేరుకోవాలనే తొందర, ఇతర ప్రయాణ సౌకర్యాలు లేకపోవడంతో..వారికి ఇలాంటి సర్కస్ ఫీట్లు తప్పడం లేదు. కనీసం అధికారులైనా స్పందించి.. ఆటో వాలాలు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.